# మాగ ఎండ

వాసిరేడు సాంబశివరావు

మనిషి ఊహ తెలియనికాలంనుంచి మమతలు, అనుబంధాలు పెంచుకొంటాడు. తనది అని చెప్పుకొనగలిగిన జీవితాన్ని, వైశిష్ట్యాన్ని సంతరించుకొనడానికి యత్నిస్తాడు. తనువు ఉన్నంతకాలమూ అలాగే ఉండాలని కోరుకొంటాడు. అంతలో వివాహం అవుతుంది. అంతవరకు ముక్కూ మొహము ఎరగని వ్యక్తి జీవితంలో ప్రవేశిస్తుంది. అంతా తారుమారు చేసివేస్తుంది. సరిపెట్టుకొనడం సాధ్యమేనా?

**శారద** అత్తవారింటికి వెళుతున్నది.

గుఱ్ఱపుబండి మెయిన్ బజారు మీదుగా వెళుతున్నది.

'అబ్బ! బజారంతా ఎంత సందడిగా ఉన్నది! క్షణాన్ని కూడా వృథా చెయ్యకూడదన్నట్లు జనం ఒకటే పరుగులు, ఒకటే ఉరుకులు! అంత జనంలో కూడా కార్లవాళ్లు మెల్లిగా పోరు; సైకిళ్లవాళ్లు దిగి నడవరు. మరి రిక్షావాళ్లు కూడా అంతే! ఎంత త్వరగా వెళ్ల వలసిన అవసరం లేకపోతే జనం రిక్షాలు ఎక్కుతారు? కాలం విలువ గ్రహించిన ఈ నాగరికత — అబ్బ!' శారద మనస్సులో అనుకున్నది. శారదకు ఈ వాతావరణం కొత్తది కాదు. ఆమె బస్తీలోనే పుట్టింది. చదువు సంధ్యలు అక్కడే సాగాయి. కానీ ఆమె మనస్సు ఇప్పుడు ఒక ఊహాలోకంలో పరిభ్రమిస్తున్నది. ఒక కొత్తవ్యక్తి జీవితంలో తాను ప్రవేశింపబోతున్నది. తెలుపుతో కలిసిన ఎర్రదనం గులాబీకి శోభను తెచ్చినట్లు తను తన భర్తతో కలిసి జీవితానికి ఒక వింత శోభ కలిగించాలి. భర్త అందమయినవాడు; బాగా చదువుకున్నవాడు. తనకు సముచితస్థానాన్ని ఇచ్చి గౌరవిస్తాడు. తనుకూడా అనుగుణంగా నడుచుకుంటుంది.

ఆమెకు అక్క చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి:

"శారూ, ఊరికే ఇంటి పనులన్నీ ఒక్కదానివే నెత్తిన వేసుకోకు, అత్తయ్య చేసుకోలేదేమోనని. ఇంటి పనులకెప్పుడూ అంటీ అంటనట్లుండాలి!" అప్పుడే అమ్మ అందుకుని అన్నది: "ఇంటి పనులు దానికేం వచ్చును గనక నెత్తిన వేసికోవడానికి?" తనకు నవ్వువచ్చింది. అమ్మే అందుకుని మళ్లీ అన్నది: "మీ ఆయనకు క్లబ్బులూ, షికార్లూ అంటే ప్రాణంట. ఊరికే ఇంటిపనుల్లో మునిగిపోక సరదాగా అతనితో కాలం గడుపుతూండాలి!"

బండి పరుగిడుతున్నది.

'అబ్బ! ఏం మునిగిపోయిందని ఈ ఉరుకులూ, పరుగులూను? ఏదో కొంపలంటుకున్నాయన్నట్లు భూమిమీద నిలవకుండా పరిగెడుతున్నారు!' శారద అత్తయ్య అనుకున్నది. ఆమె పేరు తాయారమ్మ.

"కాస్త మెల్లిగానే పోనివ్వు బాబూ, బండిని." ఆమె పైకి అన్నది.

శారద ఇంకా ఈ లోకంలోకి రాలేదు. క్లబ్బులూ, షికార్లూ, సినిమాలూ, కొత్త స్నేహాలూ, విందులూ — గుఱ్ఱపుబండి పరిగెడుతున్నది.

* * *

రోజులు గడిచిపోతున్నాయి. శారదకు ఇంటిపనులు తప్పలేదు. అమ్మా, అక్కయ్యా ఏవో చెప్పారు కానీ తనకేమిటో మహా ఇబ్బందిగా ఉన్నది. తన ప్రవర్తనలో ఏదో అసహజత చూస్తున్నది అత్తయ్య. తనను శాసించదు కాని, ఆమె పలికే ప్రతిపలుకూ, ఆమె చేసే ప్రతిపనీ తనను శాసిస్తున్నట్లే ఉంటాయి. ఆమె చేతిలో ఏదో గుత్త అధికారం ఉన్నట్లున్నది. తన భర్త జీతం తీసుకువచ్చి ఆమె చేతిలో పెడుతున్నాడు. ఎక్కడికన్నా బయటికి వెళుతూంటే తనకంటే ముందే తల్లికి చెబుతాడు. సినిమాకు బయలుదేరితే తన చెల్లెలిని కూడా వెంట రమ్మంటున్నాడు. "క్లబ్బుకు నీవెందుకూ? ఈ ఊళ్లో షికార్లేమిటి?" ఇవి ఆయన ప్రశ్నలు! "మహిళా మండలిలో ఆడవాళ్ల బలహీనత అంతా పేరుకొనిపోయి ఉంటుంది. నీవక్కడికెందుకూ?" ఇవీ ఆయన ధోరణులు!

పోనీ ఇవి ఇట్లా ఉన్నాయి, ఆయనైనా వ్యక్తిగతంగా స్వేచ్ఛగా ఉంటారా అంటే అదీలేదు. "అమ్మా! సినిమాకి వెళుతున్నాను, ఒక రూపాయి ఇవ్వు! గుడ్డలు బొత్తిగా పోయాయమ్మా!" ఇదీ వరస! తనను "తిన్నావా లేదా?" అన్నైనా అడగరు. ఆ విషయంలో ఇంకా అత్తా, మామయ్యావాళ్లే నయం. "వాడు వచ్చే వరకు నీవెక్కడ కూర్చుంటావమ్మాయ్. నీవు భోంచేసేయ్!" అంటారు.

రోజులు ఆవిధంగా గడిచిపోతున్నాయి. శారద సంక్రాంతికోసం ఎదురు చూస్తున్నది. పండుగ నెపంతోనైనా పుట్టింటికి వెళ్లి కాస్త సేదదీరవచ్చును. తన మనస్సు బాగా అలిసిపోయి ఉంది.

* * *

తులసమ్మను మేక దాని పొట్టన పెట్టుకున్నది. ఇది మూడోసారి!

ఎక్కడా చోటు లేనట్లు ఆ తల్లి దొడ్లో పరిచిన బండలమధ్య ఎక్కడో కాస్త ఖాళీ ఉంటే అందులో చోటు చేసుకున్నది. దాన్ని చూడ్డంతోటే తాయారమ్మకు మహానందమైంది. ఇంకేముంది? రోజా దానిని గూర్చి ప్రత్యేకమైన శ్రద్ధ. 'పాదు చాలదు. ఒక బండ తీసివేస్తే బాగుండు' ననుకుంది ఆమె. కానీ ఇల్లుగలాయన అందుకు ఒప్పుకోలేదు. 'రోజా పూజా పునస్కారాలు చేస్తుంటాడాయె, కాదంటాడా?' అనుకున్నదామె. కానీ ఆయన ఒప్పుకోలేదు. పైగా ఆ మొక్క ఆయన దొడ్డిఅంతా ఆక్రమించుకున్నట్లుగా బాధపడసాగాడు. "అమ్మాయ్, ఇది నవ్వువచ్చుగా తయారయింది. మళ్లీ ఎప్పుడో మేక మేసేస్తుంది" అంటూండేవాడాయన. మేకనయితే ఇస్ అనవచ్చును; కాకపోతే కర్రతో అదిలించవచ్చును కానీ..... తాయారమ్మ గుండె పిండినట్లయ్యేది.

ఆ కాస్త పాదులోనే తులసమ్మ కొమ్మలూ రెమ్మలూ వేసి మనోహరంగా పెరిగింది. తాయారమ్మకు అదొక సంబరం. మాటా పలుకూలేని ఆ మొక్కలో లేని బంధుగుణ్ణి చూసుకొనేదామె. ఆమెకు ఈ మొక్క సంబంధంగా ఒక విచిత్రమైన అభిప్రాయంకూడా ఏర్పడింది. తులసమ్మ కళకళలాడుతూంటే తన ఇల్లు కూడా ఏ చీకూ, చింతా లేకుండా సుఖంగా ఉంటుంది. తులసమ్మ కళ తప్పిననాడు తనకేదో అవాంఛనీయమైన సంఘటన సంభవిస్తుంది.

తాయారమ్మకు కళ్ల నీళ్లు ఒక్కటే తక్కువ. క్షణం ఏమరుపాటులో తల్లిని దానిపొట్టన పెట్టుకున్నది మేక. ఇదివరకు రెండుసార్లు కూడా ఈ మేకే! దీని కడుపుడక, ఎక్కడ పొంచి ఉంటుందో ఏమో?

దీనికి తోడు మళ్లీ ఏ అనిష్టం జరుగుతుందోనన్న భయం. ఆమె అట్లాగే ఆ పాదు దగ్గర ఆ నిశ్శబ్దతలో అలా ఒంటరిగా కూర్చుండిపోయింది. తులసమ్మ మళ్లీ మునపటిలా కావాలంటే ఎన్నాళ్లు పడుతుందో? అసలు మునపటిలా కాగలదా? లేత లేత కొమ్మల్ని కూడా కొరికివేసింది ఆ పాడుమేక.

ఒంటిగంటవుతుంది. తన వ్యవస్థను వీడలేక సూర్యభగవానుడు ఆకాశమార్గాన్ని అనుసరించి పోతున్నాడు. అతనిలో వేడిమి, వాడిమి తగ్గిపోయాయి.

తాయారమ్మ కొడుకు మోహన్‌రావు అప్పుడే వచ్చాడు కాలేజీ ఆఫీసునుండి, దొడ్లో కాళ్లు కడుక్కోవడానికి వచ్చాడు. తల్లి అక్కడే కూర్చుని ఉన్నది, ఏదో చెయ్యాలనుకుని చెయ్యలేక పోతున్న వ్యక్తిలాగ. శిథిల జీవితంలా ప్రత్యక్షమైంది తులసి చెట్టు. నిర్జీవమైన, నీరసమైన నవ్వొకటి అతని పెదవుల మధ్య కదిలింది.

"అమ్మా!"

తాయారమ్మ వెనుదిరిగి చూసింది. ఆమె వెంటనే లేచి కొడుక్కి వడ్డన చెయ్యడానికి ఇంటిలోకి వెళ్లింది.

"అమ్మాయేది?" చెల్లెలు కనిపించకపోతే ప్రశ్నించాడతడు.

"సీత కబురు చేస్తే వెళ్లింది, ఒక అర్ధగంటవుతుంది."

"కోడలిదగ్గరనుండి ఉత్తరమేమైనా వచ్చిందా?" తాయారమ్మ ప్రశ్నించింది. వచ్చి నాలుగునాళ్లయింది. తానే చెప్పలేదు. అయినా అందులో చెప్పడానికేముంది, చెప్పి ఆమెను ఇంకాస్త బాధపెట్టడం తప్ప! మోహనరావు మౌనం వహించాడు. ఆమెకా మౌనం అర్థం కాలేదు. తిరిగి ప్రశ్నించింది. రాలేదని చెప్పాడతను.

"పోనీ, నీవైనా వ్రాశావా?" తిరిగి అతడు మౌనం వహించాడు.

"మాట్లాడవేంరా?"

"వ్రాయలేదు."
"ఏం?"

పెరుగన్నంకోసం రోజూ వచ్చే పిల్లి మోహనరావు దగ్గరికి వచ్చి మ్యావు మ్యావు మంటున్నది. దాని అవ్యక్త రోదనలో ఆ తల్లీ కొడుకుల హృదయాలు కూడా మూగగా రోదిస్తున్నాయి.

* * *

"మరి దాని పెళ్ళి సంగతి ఏం ఆలోచించావురా?" తాయారమ్మ ప్రశ్నించింది కొడుకును. తులసమ్మ తిరిగి దాన్ని కంట పట్టింది. అందువల్ల ఆమెకు వేరే విషయాలు ఆలోచించేందుకు తీరిక దొరికింది.

తాయారమ్మ కాలానికి చాలా వెనకబడిఉంది. ఈ కాలంలోకూడా పెళ్ళికి ఆడపిల్లలకు కావలసిన అర్హతలు వంటా, వార్పూ మొదలైనవే అనుకుంటుం దామె. అందుకే కూతురి విషయంలో వంటావార్పులు నేర్పేందుకు తీసుకున్న శ్రద్ధ ఆ అమ్మాయి చదువు విషయంలో తీసుకోలేదు. 'లక్షణంగా ఇంటి పనులు చేస్తుంది. ఇరుగు పొరుగుల మంచిచెడ్డలు ఆలోచించగలదు, ఇంకా ఏం కావాలి?' అని అనుకుంటుందామె, పాపం!

'ఇంటి పనులన్నీ సక్రమంగా నిర్వహిస్తుంది. ఇరుగు పొరుగు వాళ్ళతో కలిసి మెలిసి స్నేహంగా ఉంటుంది. ఒకరి కష్టాలను పంచుకోడానికి వెనుదీయదు. పరుల సుఖాలకు ఈర్ష్య పడదు. తనకపకారం చెయ్యా లనుకునేవారి విషయంలో కూడా స్పర్ధ వహించదు. ఇంతటి చిన్న వయస్సులోనే దీక్షించటి హృదయం, మనస్సు భగవంతుడెలా ఇచ్చాడో తెలియదు. ఈ చెల్లెలి కెప్పుడు పెళ్ళి చెయ్యాలి!' ఏమిటో మోహనరావుకు గుండె పిండినట్లుండేది. ఎవరి భవిష్యత్తు ఎలా ఉంటుందో ఎవరికీ తెలియదు. అయినా మమకారం అట్లా పొకులాడుతుంది. 'చెల్లెలు సుఖపడాలి, దానికి మంచి సంబంధం లేవాలి!' — ఇంకా ఏమిటో ఆశలు. అతనికేమాత్రం సుఖమున్నదో? అతని భార్యది మిక్కిలి స్వతంత్ర ప్రవృత్తి. కొన్ని నిశ్చితాభిప్రాయా లతో వచ్చిన ఆమె తన ఉనికి ఎటువంటిదో గుర్తించడం కానీ, ఎదటివారిని అర్థం చేసుకొనేందుకు ఆ అభి ప్రాయాలను కొంచెంసేపు ఒక పక్క ఉంచడానికి ప్రయత్నించడం కానీ జరగలేదు. ఇటువంటి పరిస్థితిలో అతడికముందు సుఖపడతాడన్న ఆశకూడా లేదు. అవ్యవస్థితమైన జీవితమార్గంలో అస్థానపతితా లైన అవకాశ చిహ్నాలు అయోమయాన్ని సృష్టిస్తాయి తప్ప సుఖాన్ని చూపవు. అసలు జీవితమంటేనే అర్థం మారినప్పుడు జీవితంలో సుఖశాంతులనేవాటికి కూడా అర్థం మారవద్దూ? మరి ఆ మార్పు సంభవించిందా?

శర్మ విషయంకూడా ఇట్లాగే అయింది. జీవితం లోనికి అడుగు పెడుతూంటేనే అతనికి ఎదురుదెబ్బ తగిలింది. తెలివిగలవాళ్ళమనీ, మన ఆలోచనలనూ అభిప్రాయాలనూ అందరూ ఆమోదిస్తారనీ అనాయాసంగా భావించి బయలుదేరిన అతనికి ఏం లభించింది? చావు! మనిష్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించని ఆ ఇల్లాలు చచ్చిపోయిన వెంటనే అతని ఆస్తికి మాత్రం వెంపరలాడుతూంది. లోకానికిప్పుడు డబ్బే ముఖ్యం. కాని ఏదైనా వస్తే, "మీకు డబ్బుముఖ్యం, నామీద ప్రేమలేదు" ఇత్యాదిగా చదువుతారు. టాయన్‌బీ కాబోలన్నాడు, "భారతీయ నాగరికత పతనమై పోతున్నది, పాశ్చాత్య నాగరికత మూడు పూవు లారుకాయలుగా వర్ధిల్లుతున్నది" అని. ఆ మాటలు చదివి మోహనరావు ఒకనాడు విరుచుకుపడ్డాడు. అయినా ఇది మనంతట మనం కోరి తెచ్చుకున్నది. కాలప్రభావంకూడా లేకపోలేదు.

"డబ్బుకోసం చూస్తున్నావమ్మా! అనంతరామయ్య య్యకు ఉత్తరం వ్రాశాను. ఈలోపల నాన్నని గుంటూరు వెళ్ళి ఆ సంబంధం విషయం కనుక్కో రమ్మను."

"దాని అదృష్టం ఎట్లా ఉన్నదో?"

"ఉన్నంతలో దానికేం కొరతా రాదులేవమ్మా! నా ఉద్యోగంలో మిగిలినదంతా దానికీ, దాని పిల్లలకీ ఇస్తాను. మంచి రోజు చూసి పెళ్ళి వ్రాద్దామనుకుంటున్నాను."

"అదేమిట్రా? అవేం పిచ్చిమాటలు?"

"పిచ్చి మాటలేమిటమ్మా? ఏదైనా ముందు జాగ్రత్త పడటం మంచిది కదా?"

"నా బొందిలో ఊపిరి ఉన్నంతవరకూ ఆ పని మాత్రం చెయ్యకు. వాళ్ళెట్లా ఏడిస్తే మన కెందుకు? ఇవాళ కాకపోతే రేపు రాదా ఆ పిల్ల? ఇక చెల్లెలి పెళ్ళంటావా, ఆ బరువు నీ కెలాగూ తప్పదు."

తిరిగి సంక్రాంతి వచ్చింది. కోరికలవంటి మంచూ, వైరాగ్యంవంటి చలి, శ్రుతి కుదరని సాతానివాని కీర్తనలూ, వైషమ్యాలవంటి భోగిమంటలూ — వీటి నన్నింటినీ వెంట బెట్టుకుని సంక్రాంతి వచ్చింది. బంతిపూలెక్కడా కనిపించలేదు.

"సంవత్సరం!" అనుకున్నాడు మోహనరావు.

దిగులుగా నిట్టూర్చింది తాయారమ్మ.


అన్న ముఖంలో ఏదో విషాద నీలిమచ్ఛాయను చూసింది తాయారమ్మ కూతురు.

'కోడలికి జీవితాన్ని గూర్చిన ఆలోచన లేదేమో?' అనుకున్నాడు మోహనరావు తండ్రి.

మారుతున్న జీవిత వ్యవస్థను అర్థం చేసుకోలేని ఒకానొక అమాయక సంసారం ఇది. అందుకే వీరికి సుఖం లేదు, శాంతి లేదు. ఆదర్శాలూ, అనురాగాలూ, అనుబంధాలూ వీటి కిక జీవితంలో స్థానం లేదు. మోహనరావు వేరుపడాలి. చెల్లెలు, తల్లిదండ్రుల బాధ్యత తనకుండగూడదు. అప్పటిదాకా బహుశః శారద రాదేమో? శారద రావడానికింకా ఎన్ని సంక్రాంతులు గడిచిపోవలెనో?

* * * *

మోహనరావు జీవితం ఎదుర్కొనే రోజుల్లో అతి ప్రశాంతంగా ఉండేది. తన చదువేమో, తనేమో! నిర్విచారంగా కాలాన్ని వెళ్ళబుచ్చేవాడు. సంపన్న కుటుంబం కాకపోయినప్పటికీ గాలి దాపరికం లేకుండటంవల్ల అతడు హాయిగా కాలం గడిపేవాడు. అందువల్లనే జీవితంలో చేదు రుచి చూడటంగానీ, భావించడంగానీ జరగలేదు. లోకం బాహ్యమార్గంలోనే ప్రవర్తిస్తున్న దనుకొనేవాడతడు. అతని ఆలోచనలు, ఆవేశాలు ఏవో ఊహాలోకసంబంధాలుగా ఉండేవి. ఉద్యోగంలో చేరిన





పిదపకూడా ఆ పరిస్థితికి వ్యాఘాతం కలగలేదు. ఆ తరవాతనే అతని జీవితంలో ఈ కల్లోలం రేగింది. అందులో ఆరని నైరాశ్యం జనించింది. పెళ్లి అన్నప్పుడు మోహనరావుకు విశ్వనాథవారి ''ఓసి వసిదాన, భవన్నియమ ప్రభావసంధానముచేత నీ పతి సుధామయ మూర్తి సముజ్జ్వలించెడున్'' అన్న వాక్యం గుర్తుకు వచ్చేది. ఆ పెళ్లే అతని జీవితంలో ఎన్నడూలేని హాలాహలాన్ని ప్రభవింప జేసింది. 'జీవితం సూర్యరశ్మినీ, గాలివానలనూ అనుసరించి ప్రవృద్ధినందే మొక్క వంటిది' అని అనుకున్నాడు గానీ అతడు మాటి మాటికీ కొన్ని పరిస్థితులను కృత్రిమంగా కల్పించుకుని పరిశోధనశాలలో ప్రోది చేయవలసిన సస్యమనుకోలేదతడు. అందుకే శారద మనస్సెటువంటిదో, ఆమె అభిలాష ఏమిటో, ఆమె ఆశయాలేమిటో ప్రత్యేకంగా తెలుసుకోవడానికి ప్రయత్నించలేదు. అతడు ఆమెనుండి వాంఛించిన దొకటే! తన కుటుంబంలో ఆమె ఒకటిగా కలిసిపోవడం, 'నేను నీకు అర్ధాంగిని కానీ మీ అమ్మకు కోడలిని కాను!' అన్న

# రూ. 12,000 గెలవండి

## 176 రొఖవు బహుమానములలో!

## కాల్‌గేట్ బేబీ పౌడర్ ఛాయాచిత్ర పోటీ!




[illegible]

ప్రతీ వర్గమునందును బహుమానములు:
మొదటి బహుమానం—రూ. 1,000
రెండవ బహుమానం —రూ. 500
మూడవ బహుమానం —రూ. 250
రూ. 50 చొప్పున 85 ప్రోత్సాహక బహుమానములు
ఈ పోటీలో పాల్గొనుట సులభం:

షరతులను, నిబంధనలను శ్రద్ధగా చదవండి. దిగువ ప్రవేశపత్రమును కత్తిరించి, పూరించండి. ఛాయాచిత్రమును మరియు రొఖవు రశీదును దీనితో జతపరచి—మీ ప్రవేశపత్రమును తపాలా ద్వారా పంపండి!

గెలుచుటకు ఎన్నో అవకాశములు! ఈ పత్రమును ఇప్పుడే కత్తిరించండి—త్వరలో పాల్గొనండి!

### షరతులు మరియు నిబంధనలు

1. ఈ పోటీలో భారత దేశ నివాసులే పాల్గొనవలెను.

2. కాల్గేట్-పామోలివ్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ మరియు గ్రాంట్ ఎడ్వర్టయిజింగ్ ఇంటర్నేషనల్ ఇంక్. వారి ఉద్యోగులు ఈ పోటీలో పాల్గొన అర్హులు కారు.

3. ప్రవేశములు, రెండు వర్గములలో ఒక దానియందలి బిడ్డల ఛాయాచిత్రములు 1967లో తీసి యుండవలెను.

(a) 1½ సంవత్సరములలోపు వయస్సు. (b) 1½ నుంచి 3 సం.ల వయస్సు. ప్రతీ వర్గమున్ను వేరుగా తీర్పరించబడును. ప్రతీవర్గమందు బహుమానములు దిగువ విధంగా ఇవ్వబడును.

మొదటి బహుమానం—రూ. 1000; రెండవ బహుమానం — రూ. 500; మూడవ బహుమానం — రూ. 250; రూ. 50 చొప్పున 85 ప్రోత్సాహక బహుమానములు.

4. మొత్తం మీద అన్ని అంశాలా అనువర్తించే దృష్టిలో ఛాయాచిత్రములు తీర్పరించబడును.

5. 8" x 6" సైజు మించకుండావుండే నలుపు-తెలుపు ఛాయాచిత్రములను మాత్రమే పంపవలెను. బిడ్డయొక్క వయస్సు వర్గము మరియు పోటీలో పాల్గొనే వారి పేరు, చిరునామా ఛాయాచిత్రము యొక్క వెనుక వైపున స్పష్టముగా వ్రాయవలెను. ఛాయాచిత్రములు తిరిగి పంపబడవు.

6. కాల్‌గేట్ బేబీ పౌడర్ ఒక పెద్ద లేక జియంట్-సైజు డబ్బీ కొన్నట్లు ఉదహరించబడిన వ్యాపారి యొక్క అచ్చు వేసిన రొఖవు రశీదును (రూ. 2.00 మించినది) చేర్చి ప్రతీ ఛాయాచిత్రమును పంపవలెను. అట్టి అచ్చువేసిన రొఖవు రశీదును చేర్చకుండా పంపిన ప్రవేశములు నిరాకరించబడును.

7. ఒకటి కంటె ఎక్కువగా ప్రవేశములను, ప్రతిదీ వేర్వేరుగా రొఖవు రశీదు మరియు ప్రవేశ పత్రము చేర్చబడినట్టివి మీరు పంపవచ్చును; ఇంకా అదనపు ప్రవేశముల కోసం, ప్రవేశ పత్రమునందున్న ట్లే వివరములను సరిగా ఒక తెల్ల కాగితము మీద వ్రాసి దానిని మీ ప్రవేశ పత్రముగా ఉపయోగించవచ్చును.

8. ప్రవేశ పత్రమును ఇంగ్లీషులో పూరించవలెను.

9. మీ ప్రవేశ పత్రము/ప్రవేశ పత్రములు మాకు 1967 జూన్ 30 తేదీలోపుగా చేరవలెను.

10. మహారాష్ట్ర స్టేట్ స్త్రీల సంఘమందలి సభ్యులైన తీర్పరి బృందం ప్రవేశములను తీర్పరింతురు. వారి తీర్పు న్యాయమైనది మరియు బద్ధమైనది. ఈ సందర్భంలో ఉత్తర ప్రత్యుత్తరములు జరుపబడవు.

11. గెలుపు దారులకు తపాలా ద్వారా తెలుపబడును.

**ENTRY FORM**

PLEASE FILL IN ALL THESE PARTICULARS IN ENGLISH USING BLOCK LETTERS:

Age Group Under 1½ years 1½ to 3 years (Cross out whichever not applicable)

Name of Baby. ______________________ Date of birth: __________

Name of Parent/Guardian: ______________________

Address. ______________________

______________________

I have read the Rules and Regulations and agree to abide by them.

Signature: ______________________

YOUR ENTRY MUST REACH THE FOLLOWING ADDRESS BEFORE JUNE 30, 1967:
Colgate Baby Powder Photographic Contest (A Pr), Post Bag No. 10043, Bombay 1.

CBP.G BTEL


భావం శారదది.

ఇటువంటి మానసిక సంఘర్షణ జరుగుతున్న సమయంలో సంక్రాంతి అన్న వంకతో శారద పుట్టింటికి వెళ్ళింది. మోహనరావు ఆమెతో వెళ్ళలేదు. వెళ్ళిన శారద ఒక ఉత్తరంకూడా వ్రాసింది. అది ఉత్తరం కాదు, శారద కోరికల పత్రం. ఒకానొక కుటుంబ వ్యవస్థను అనుకోకుండా తెంచివెయ్యగలిగిన అవిత్రం! ఆ కోరికలను తీర్చాలన్న ఔదార్యం మోహనరావు తనకు లేదన్నాడు. తల్లిదండ్రులు తనకు కష్టించి చదువుసంధ్యలు నేర్పారు. ఇప్పుడు వాళ్ళకు తనే ఆధారం వాళ్ళ పోషణభారం తన బాధ్యత. చెల్లెలి పెళ్ళికూడా అంతే! శారద తనను పెళ్ళిచేసుకొన్నదేగానీ తన బరువు బాధ్యతలను పంచుకోవడానికి అంగీకరించడం లేదు. ఇదెక్కడి ధర్మం? ఎంత కాలం మారినా, బాధ్యతలు లేని హక్కు లెక్కడివి?

మోహనరావు జీవితం ఇప్పుడొక మౌనస్రవంతి. పరిసరాల ప్రమేయంలేక, పల్లాన్ని అనుసరిస్తూ నిర్జీవ మార్గంలో పడిపోతున్నదది. శారద తన మనస్సును మార్చుకొనేవరకూ ఆమెతో తనకు సంబంధం లేదు. అటువంటి నిశ్చయంతో సాగిపోతున్న మోహనరావుకు ఎవరో చెప్పారు, శారద దిగులు పడ్డదనీ, ఆమె అతని దగ్గిరికి రావాలని మధనపడుతున్నదనీను. దీనికి తోడు అహరహమూ ఇంటిలో తల్లిదండ్రుల పోరు. ఆ మౌన స్రవంతిలో ఏదో ఒక సుడి లేచినట్లయింది. మానవుణ్ణి బలహీనపరచడానికి అతని భార్య దిగులు పడినదనడమూ, అతని దగ్గిరికి వెళ్ళాలని కోరుతున్న దనడంకంటే ఇంకేం కావాలి? కాలమూ, పరిస్థితులూ ఇంత బలమైనవని తెలిస్తే మోహనరావు ప్రవర్తన మరోక విధంగా ఉండి ఉండేదేమో?

* * *

శారద వచ్చింది.

వచ్చిన శారద ఏమీ జరగనట్లుగానే ప్రవర్తించ సాగింది. బహుశః తల్లిదండ్రులు నేర్పిన బుద్ధులతోనే ఆమె మనస్సు పాడైపోయి ఉండవచ్చు. మోహనరావులో మాత్రం తీరని ఆవేదన కుతకుతలాడుతున్నది. 'తను చేసినది తప్పు' అన్న పశ్చాత్తాపంకూడా ఆమెలో కనబడడం లేదు.

మోహనరావు చాలా ముభావంగా ఉంటున్నాడు. శారదతో మాట్లాడడంలేదు. ముక్తసరిగా ఊఁ, ఊఁహుఁ అని తప్ప వేరే జవాబు చెప్పడంలేదు. ఇది చూస్తూ ఉండడంతప్ప తాయారమ్మ చెయ్యగలిగిందేమీ లేదు. ఆ ఇంటిలో ఎల్లెడలా ఒక నిశ్శబ్దత అలుముకున్నది. ఆ నిశ్శబ్దాన్ని భంగం చెయ్యడానికి మోహనరావు చెల్లెలింతగానో ప్రయత్నించేది.

"పలుకే బంగారమయిందేం?" స్త్రీ సహజమో ఏమో కానీ, ఒక రోజు శారద అలవోకగా మోహనరావును నిలవరించి ప్రశ్నించింది.

చిరుగాలికి అల్లల్లాడిన చిగురుటాకులా అయింది మోహనరావు మనస్సు. తెప్పరిల్లుకుని ఆమె వైపు నిర్జీవంగా చూశాడు మోహనరావు.

"మాట్లాడగూడదనుకున్నారా?" శారద తిరిగి ప్రశ్నించింది.

ఆమెను తప్పుకుని పక్కకు వెళ్ళబోయాడు

మోహనరావు.

తాయారమ్మా, ఆమె కూతురూ బయట వసారా లోకి వెళ్లారు.

వెళ్లబోతున్న మోహనరావు చేతిని గట్టిగా పట్టు కున్నది శారద.

"ఊఁ!" శారద అతని కన్నులలో కన్నులుంచ ప్రయత్నించింది.

మోహనరావు కన్నులు మూసుకున్నాయి. చేతిని విడిపించుకో ప్రయత్నించాడతడు. పట్టుదల కొద్దీ శారద చేతిపట్టు విడవలేదు. తిరిగి శారద కన్నులు మోహనరావు కన్నులను గుచ్చివేశాయి.

"నాతో మాట్లాడరా?"

మాట్లాడక తప్పలేదు. "ఎందుకు మాట్లాడను?"

"మాట్లాడడం లేదుగా?"

"ఎందుకు మాట్లాడడంలేదు?"

శారద కన్నులు నీళ్లతో నిండిపోయాయి.

మోహనరావు అయోమయపరిస్థితిలో పడిపోయాడు.

"ఎందుకా కళ్ల నీళ్లు?" అని అడగలేదు మోహన రావు. అడుగుతాడేమో ననుకున్నది శారద. 'ఈ మనిషికి తన ఉనికితో సంబంధంలేదు కాబోలు' అనుకున్నదామె. 'ఆడవాళ్లే ఇంత!' అని అనుకున్నాడేమో మోహనరావు, వ్యాకులమైన చిత్తంతో కుర్చీలో చేరగిలబడ్డాడు.

శారద వసారాలోకి వెళుతూ వెళుతూ వెనుదిరిగి చూసింది.

ఆ కన్నులలో జాలిలేదు, జీవంలేదు, ఏ భావమూ లేదు. తనవైపలాగే చూస్తున్నాడాయన.

గుమ్మం దగ్గిర కొంచెం సేపాగింది శారద. తిరిగి వెనకకు వచ్చింది. వచ్చి మోహనరావు మెడచుట్టూ చేతులువేసి వెయ్యబోయింది శారద.

మోహనరావు కన్నులు మూసుకుని అలాగే కుర్చీలో జారగిలబడి ఉన్నాడు. బాధ, క్రోధము ఏదీ కదిలించ లేని ఆ జీవుని నిర్వికారతకు శారద భయపడింది. హఠాత్తుగా అతని మెడను కౌగలించుకున్నది శారద, పసిపాప అబగా కుడుస్తున్న రొమ్మును పట్టుకున్న ట్లుగా!

తన మెడను గట్టిగా పెనవేసుకున్నది శారద. కన్నులు తెరిచి, తను ఎటూ కదలలేని పరిస్థితి గమనించి, ఒక్క సారి నిట్టూర్చి తిరిగి కన్నులు మూసుకున్నాడు మోహన రావు.

శారద క్షణాలను లెక్కపెట్టింది. తన వోదార్చడానికి గూడా ప్రయత్నించడం లేదాయన. తను ఒంటరిదై పోయింది.

కౌగిలి వదిలి శారద లేచి వెళ్లిపోయింది. వెళుతూ వెళుతూ వెనుదిరిగి చూసింది. మనిషిలో కదలిక లేదు. 'పిల్లిలా కళ్లు మూసుకున్నా' డనుకున్నది శారద.

* * *

జీవితంలాంటి రోడ్డుమీద బరువుగా సాగిపోతు న్నది చిన్న కారు. శారద కనడానికి పుట్టింటికి వెళు తున్నది తండ్రివెంట.

మూగ ఎండ కాస్తున్నది.

శారద ఏమిటో ఆలోచిస్తున్నది.

'మనసులు సరిగా కలియనే లేదు. ఇద్దరిమధ్యా పొందిక అంటూ అసలే లేదు. ఎడముఖం పెడముఖంగా కాలం గడుపుతూంటే ఈ నెలతప్పడ మేమిటి?' శారద మనస్సు ఇంకా ఏదో ఆలోచిస్తున్నది. 'జీవితాన్ని ఒక వృత్తంలో బిగించుకుని ఆ పరిధుల్లోనే తిరుగుతున్న తన భర్తను తా ననుసరించలేకపోతున్నది. పోనీ ఆయ నైనా తన ముద్దుమురిపాలు పట్టించుకుంటాడాఅంటే, మనసూ ఏర్పిగా ఆయన అలా పట్టించుకున్నట్టు తన కనిపించరు. మరి ఎట్లా? సంజవేళలాంటి ఈ బ్రదుకును పగటికో, రాత్రికో అనుసంధానించుకోవాలి! ఈ మానసిక ఘర్షణలో తను ప్రసవించే శిశువు ఎలా ఉంటాడు? ఏమైపోతాడు? ఇదమిత్థమని తేలని ఒకా నొక జీవనవ్యవస్థలో తనుకూడా కొట్టుమిట్టాడతాడా? అసలు తాను బ్రతికి బిడ్డను సాకగలదా?'

"శారదా!" తండ్రి పిలిచాడు. కానీ ఆ పిలుపు శారద భావనాలోకాన్ని చేరలేదు.

"అమ్మా, శారదా!" శారద ఈ లోకానికి వచ్చింది.

"ఏమిటమ్మా ఒక్క మాటన్నా మాట్లాడవేం? ఏమిటాలోచిస్తున్నావు?"

శారదనుండి జవాబు లేదు.

"ఏమమ్మా!"

శారద నవ్వింది. జీవంలేని ఆ నవ్వు తండ్రిని కదిలించివేసింది.

"అట్లా ఉన్నావేమమ్మా?"

"కారును వెనక్కి తిప్పమను, నాన్నా!"

"ఏం, ఎందుకు?"

"ఇంటికి పోవాలి!"

"అదేమిటి?"

"వారికి చెప్పిరాలేదు."

"తల్లీ, ఒక్క విషయం అడుగుతాను చెప్పు. మోహనరావు నీకు అనుకూలంగా ఉండడంలేదా?"

పసిపిల్ల బెదిరినట్లుగా చూసింది శారద.

"ఊఁ?"

"ఎందుకుండడంలేదు, నాన్నా?"

"మరి అలా దిగులుగా చూస్తున్నావేమిటి? అత్తయ్యా వాళ్లూ సరిగ్గా చూడడంలేదా?"

"అదేమీ లేదు, నాన్నా! నన్నంతా బాగానే చూస్తు న్నారు. అత్తయ్యా, మామయ్యా సొంత కూతురులా చూసుకుంటారు."

"మరి నీ వలా ఉండడానికి కారణం? నన్ను మభ్య పెట్టడానికి ప్రయత్నించకమ్మా!"

"మభ్యపెట్టడమేమిటి, నాన్నా! అదేమీ లేదు. కానీ..."

"కానీ—?"

ఇద్దరూ పడుతున్న మథన, వారి మనసులలోని సంఘర్షణ, తానన్నినాళ్లు పుట్టింటిలో ఉండడాన్ని క్షమించని ఆయన ప్రవర్తన, ఆయన తనను మన్నించ డంలేదని తను పడే బాధ—ఈ వేదనను శారద ఎలా వెలిగక్కగలదు? ఈ జీవులు పడుతున్న హింసను ఆ తండ్రి ఎలా అర్థం చేసుకోగలడు?

కారు ముందుకు పోతూనే ఉన్నది.

"కారును తిప్పమను, నాన్నా!"

"......"

"ఆయనకు చెప్పివస్తాను. కారు తిప్పమను, నాన్నా!"

"వద్దులేమ్మా, ఫరవాలేదు. వెనక్కి వెళ్లడం బాగుండదు." ★





